సచివాలయ ఉద్యోగులకు 'సర్వే'ల ఒత్తిడి

- అధికారుల ఒత్తిడి తట్టుకోలేకపోతున్న ఉద్యోగులు
- 10 నెలల కూటమి పాలనలో 19 సర్వేలు
- రేషనలైజేషన్ పేరుతో ఉద్యోగుల కుదింపు

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల పరిస్థితి దారుణంగా మారింది. గత ప్రభుత్వం వాలంటీర్లతో చేయించిన సర్వేలను, ఇతర పనులను ఇప్పుడు సచివాలయ ఉద్యోగులతో చేయిస్తున్నారు. సర్వేల టార్గెట్లతో మున్సిపల్ కమిషనర్, ఎంపిడిఒలు తెస్తున్న ఒత్తిడిని తట్టుకోలేక సచివాలయాల ఉద్యోగులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 10 నెలల్లో దాదాపు 19 సర్వేలు చేయించింది. అయితే ఇప్పటి వరకు ఏ ఒక్కరికీ రేషన్ కార్డు కాని, ఫింఛను గాని మంజూరు చేయలేదు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 1207 వరకూ గ్రామ, వార్డు సచివాలయాలు ఉన్నాయి. ఇందులో ప్రభుత్వం 12, 966 పోస్టులు మంజూరు చేస్తే ఇందులో 10, 083 సచివాలయ సెక్రటరీలు పని చేస్తున్నారు. ఇక రెండు జిల్లాల్లో చూస్తే అనంతపురం జిల్లాలో 663 సచివాయాలకు గాను 7106 మంది సెక్రటరీలు ఉండాల్సి ఉంటే 5615 మంది ఉన్నారు. శ్రీ సత్య సాయి జిల్లాలో 544 సచివాయాలకు గాను 5860 మంది సెక్రటరీలు ఉండాల్సి ఉంటే 4468 మంది ఉన్నారు.

ప్రజాశక్తి-హిందూపురం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన అనేక అంశాలపై క్షేత్ర స్థాయిలో సమాచారం తెలుసుకునేందుకు సచివాలయ ఉద్యోగులతో ఉన్నతాధికారులు పలు రకాల సర్వేలు చేయిస్తున్నారు. ఇలా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 10 నెలల్లో దాదాపు 19 వరకూ సర్వేలు చేయించిన పరిస్థితి ఉంది. ఒక సర్వే పూర్తికాకముపే మరో సర్వే అప్పగిస్తూ తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. పదేపదే ఇళ్లకు వెళ్లడంతో ఒకసారి రావొచ్చుకదా... అన్నిసార్లు ఎందుకు వస్తున్నారంటూ ఉద్యోగులపై జనం అసహనం వ్యక్తం చేస్తున్నారు. గత వైసిపి ప్రభుత్వంలో 2019 అక్టోబర్ రెండో తేదీన గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ ప్రారంభమైంది. రెండు వేల మందికి ఒక సచివాలయం చొప్పున ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ప్రతి సచివాలయంలోనూ డిజిటిల్ అసిస్టెంట్, వెల్ఫేర్ సెక్రటరీ, మహిళా పోలీస్, ఎఎస్ఎం. సర్వేయర్, అగ్రికల్చర్ అసిస్టెంట్, వెటర్నరీ అసిస్టెంట్ ఇలా 11 శాఖలకు చెందిన ఉద్యోగులు ఉండేలా ముందుకు సాగింది. అయితే సచివాలయ ఉద్యోగుల సంఖ్య తక్కువగా ఉండడం, ఇతర ప్రాంతాల బాధ్యతలు కూడా వారికే అప్పగించడంతో పనిభారం మరింత పెరిగింది. దీంతో, వివిధ ధ్రువపత్రాలు, ఇతర పనుల కోసం సచివాలయాలకు వచ్చే వారికి వారు అందుబాటులో ఉండలేకపోతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 11 మంది, పట్టణ ప్రాంతాల్లో పది మంది ఉద్యోగులతో గత ప్రభుత్వం సచివాలయాలను ఏర్పాటు చేసింది. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో ఏడుగురు, పట్టణ ప్రాంతాల్లో ఆరుగురు మాత్రమే ఉంటున్నారు. బ్యాంకర్లు తమ ఖాతాదారుల ఆధార్ లింక్, ఇకెవైసి బాధ్యతలను కూడా ఇటీవల సచివాలయాల ఉద్యోగులకు అప్పగించడం వివాదస్పదమైంది. ఈ పనిని బ్యాంకు ఉద్యోగులు చేయాల్సి ఉండగా వివిధ పథకాల కింద నిధులు జమ చేసే పేరుతో అధికారులు ఈ బాధ్యతలను తమకే అప్పగించారని సచివాయాల ఉద్యోగులు వాపోతున్నారు. ఐటి శాఖ చేయాల్సిన వర్క్ ఫ్రం హోం, సిటిజన్స్ గుర్తింపు సర్వేనూ తమకే అప్పగించినట్లు చెబుతున్నారు. తాజాగా పి4 సర్వే మొత్తం సచివాలయాలకు అప్పగించారు. పరిశ్రమల శాఖ నిర్వహించాల్సిన ఎంఎస్ఎంఇ సంస్థల గుర్తింపును తమకే అప్పగించారని సచివాలయాల ఉద్యోగులు వాపోతున్నారు. తుపాన్లు, వరదలు, ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు ఇబ్బందులు తలెత్తకుండా హౌస్‌హోల్డ్ మ్యాపింగ్, వ్యక్తుల నివాసిత గుర్తింపు వివరాల నమోదుకు ఇంటి ఫొటోలు, జియోట్యాగింగ్ బాధ్యతలు ఇటీవల సచివాలయాల ఉద్యోగులు పూర్తి చేశారు. నేషనల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో భాగంగా చిన్నారులను గుర్తించి, ఆధార్‌లో నమోదు చేయించే బాధ్యతలను కూడా వారికే అప్పగించారు. చర్మకారులకు పలు పథకాల అమలుకు లబ్ధిదారులను గుర్తించడం, పింఛనుదారుల్లో అనర్హుల గుర్తింపునకు వారికి నోటీసులు జారీ చేయడం, వికలాంగులను తిరిగి వైద్య పరీక్షలకు పంపడం తదితర పనులను సచివాలయ ఉద్యోగులతోనే చేయిస్తున్నారు. సహకార సంఘాల్లో రికార్డుల కంప్యూటీకరణలో భాగంగా రైతులకు ఇకెవైసి చేయడాన్ని సంబంధిత శాఖ ఉద్యోగులకు కాకుండా ఈ పని కూడా సచివాలయాల ఉద్యోగులకే అప్పగించారు. సిటిజన్ గుర్తింపు, గుర్తింపు సర్వే మున్సిపల్, గ్రామ పంచాయతీలు చేయాల్సి ఉండగా ఈ పని కూడా సచివాలయ ఉద్యోగులతో చేయిస్తున్నారు. రైతులకు సంబంధించిన భూ ఆధార్ నమోదును సచివాలయాల్లోని వ్యవసాయ సహాయకుడికి అప్పగించారు. బియ్యం కార్డుల్లోని సభ్యులు ఇకెవైసి బాధ్యతను విఆర్ఒ చేయాల్సి ఉండగా, ఈ పని కూడా తమకే అప్పగించారని సచివాలయ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో వాలంటీర్లు చేసిన ప్రతి పనినీ సచివాలయాల ఉద్యోగులకు అప్పగించారు. వివిధ శాఖల ఉద్యోగులు చేయాల్సిన అన్ని పనులనూ తమకే అప్పగిస్తున్నారని, దీనివల్ల సచివాలయాలకు వచ్చే ప్రజలకు అందుబాటులో ఉండలేకపోతున్నారని, తద్వారా పౌర సేవల్లో కొంత జాప్యం జరుగుతున్న మాట వాస్తవమేనని, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లామని సచివాలయాల ఉద్యోగుల అసోసియేషన్ జిల్లా నాయకులు తెలిపారు. మున్సిపాలిటీల్లో, మండల పరిషత్తుల్లో అనేకమంది ఉద్యోగులు ఉన్నా ప్రతి పనికీ సచివాలయాల ఉద్యోగులకు అప్పగించేస్తున్నారని వారు చెప్పారు. గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులపై పని భారం తగ్గించాలని, సంబంధం లేని పనులు అప్పగించ రాదని వారు డిమాండ్ చేస్తున్నారు.

రేషలైజేషన్ తో 4100 పోస్టులకు ఎసరు

ప్రభుత్వం సచివాలయ వ్యవస్థ, ఉద్యోగులకు సంబంధించిన రేషనలైజేషన్‌ను ప్రారంభించింది. సచివాలయాలను మూడు కేటగిరీలుగా విభజించింది. 2,500 జనాభాలోపు ఉన్న సచివాయాలను 'ఎ' కేటగిరీలో, 2,500 నుంచి 3,500 జనాభా ఉన్న వాటిని 'బి' కేటగిరీలో, 3,500 జనాభా పైన ఉంటే 'సి' కేటగిరీలో పెట్టింది. ఉద్యోగులను రెండు రకాలుగా విభజించింది. మల్టీపర్పస్ ఉద్యోగులుగా పంచాయతీ సెక్రటరీ, డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్, మహిళా పోలీసులు ఉన్నారు. టెక్నికల్ ఉద్యోగులుగా విఆర్‌డి, ఎఎన్ఎం, సర్వేయర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్, అగ్రికల్చర్, హార్టికల్చర్, సెరికల్చర్ అసిస్టెంట్లు, లైన్మెన్లు ఉన్నారు. 'ఎ' కేటగిరీలో సచివాలయాలకు కేటాయించిన ఆరుగురు ఉద్యోగుల్లో పంచాయతీ సెక్రటరీ లేక డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్ లేక మహిళా పోలీస్ తోపాటు మరో నలుగురు టెక్నికల్ ఉద్యోగులు ఉంటారు. 'బి' కేటగిరీలో పంచాయతీ సెక్రటరీ, డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్ లేక మహిళా పోలీస్ తోపాటు మరో నలుగురు టెక్నికల్ ఉద్యోగులు ఉంటారు. 'సి' కేటగిరి సచివాలయాల్లో పంచాయతీ సెక్రటరీ, డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్, మహిళా పోలీస్ తోపాటు మరో నలుగురు టెక్నికల్ ఉద్యోగులు ఉంటారు. 'ఎ', 'బి' కేటగిరీల్లో వెల్ఫేర్ సెక్రటరీ లేకపోతేనే మహిళా పోలీసులు ఉంటారు. దీంతో ఇప్పుడు ఆయా సచివాలయాల్లో ఉన్న మహిళా పోలీస్ ఉద్యోగులను ఎక్కడకు పంపిస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. సగటున ప్రతి మండలంలో 12 నుంచి 20 సచివాలయాలు ఉన్నాయి. వీటిలో నాలుగు నుంచి ఐదు వరకూ 3,500కు పైగా జనాభా ఉన్న 'సి' గ్రేడ్ సచివాలయాలుగా ఉన్నాయి. మిగిలిన చోట్ల పని చేస్తున్న మహిళా పోలీసులను ఏం చేస్తారో ప్రభుత్వం ఇంకా చెప్పకపోవడంతో ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంది. సచివాలయాల్లో ఉద్యోగుల సంఖ్యను కుదిస్తున్నారు. దీంతో ఒక్క హిందూపురం పురపాలక సంఘంలోనే 137 పోస్టులను తగ్గిస్తున్నారు. ఇక జిల్లాల వారిగా చూస్తే అనంతపురం జిల్లాలో దాదాపు 2600 పోస్టులు, శ్రీ సత్య సాయి జిల్లాలో 1500 పోస్టులకు ప్రభుత్వం ఎసరు పెడుతున్నట్లు తెలుస్తోంది. దీంతో సచివాలయ ఉద్యోగులకు సర్వేలు, పింఛన్ల పంపిణీ వంటి పనిభారం మరింత పెరగనుంది. ఈ నేపథ్యంలో సచివాలయ ఉద్యోగుల్లో తీవ్ర టెన్షన్ నెలకొంది,

పట్టణంలో సర్వే నిర్వహిస్తున్న సచివాలయ ఉద్యోగి

పరిగిలో ఘోర రోడ్డు ప్రమాదం

ముగ్గురు మృతి, మరో ఇద్దరి పరిస్థితి విషమం

ప్రజాశక్తి - పరిగి

గాయపడిన వారిని అంబులెన్స్‌లో తరలిస్తున్న దృశ్యం

శ్రీసత్యసాయి జిల్లా పరిగి మండలం ధనాపురం సమీపంలో కొడికొండ చెక్ పోస్ట్-సిరా జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతిచెందారు. మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ప్రమాదంలో గాయపడిన మరో ఏడుగురు హిందూపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. తీవ్రంగా గాయపడ్డారు. ఆటోను గుర్తుతెలియని వాహనం వెనుకవైపు నుంచి ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదానికి సంబందించి స్థానికులు, మృతుల బంధువులు తెలిపిన వివరాలు... రొద్దం మండలం దొడగట్టకు చెందిన వారు హిందూపురం సమీపంలోని కొట్టి చౌడేశ్వరి దేవస్థానంలో భజన చేయడానికి శనివారం రాత్రి ఆటోలో వెళ్లారు. భజన అనంతరం ఆదివారం తెల్లవారుజామున తిరిగి స్వగ్రామానికి బయలు దేరారు. వీరు ప్రయాణిస్తున్న ఆటోను పరిగి మండలం ధనాపురం సమీపంలోని జాతీయ రహదారి 544లో వెనుకవైపు నుంచి గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో దొడగట్టగ్రామానికి చెందిన అలివేలమ్మ(45), ఆదిలక్ష్మమ్మ(65), సాకమ్మ(60) అక్కడికక్కడే మృతిచెందారు. విజయ్, సుజాత, అభి, బబ్లు, ప్రమీలమ్మ, అంజిరెడ్డి, రూప, యశ్వంత్ కుమార్, అంజినమ్మ, ఆటోబాబు, పాపమ్మ గాయాలపాలయ్యారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో వారిని మెరుగైన చికిత్స నిమిత్తం బెంగుళూరుకు తరలించారు. ప్రమాద విషయం తెలుసుకున్న స్థానిక ఎస్ఐ రంగడుయాదవ్ సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ప్రమాదానికి గురైన వారందరూ వ్యవసాయమే జీవనోపాధిగా కూలి పనులు చేసుకునే కుటుంబాలకు చెందిన వారు. వారి కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని ఇటు రైతు సంఘం నాయకులు ఇటు పలు రాజకీయ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని హిందూపురం పార్లమెంటు సభ్యులు బికె. పార్థసారథి, హిందూపురం మున్సిపల్ ఛైర్మన్ డిఇ రమేష్ తదితర నాయకులు పరామర్శించారు.

మృతురాలు అలివేలమ్మ(ఫైల్‌ఫొటో)

మృతురాలు ఆదిలక్ష్మి (ఫైల్‌ఫొటో)

మృతుల కుటుంబాలను పరామర్శించిన సబ్‌కలెక్టర్

రొద్దం : పరిగి మండలం ధనాపురం జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని దొడగట్ట గ్రామానికి చెందిన ముగ్గురు మహిళలు అక్కడికక్కడే మృతిచెందిన విషయం తెలుసుకున్న పెనుగొండ సబ్ కలెక్టర్ ఆనంద్ కుమార్ ఆదివారం సాయంత్రం మృతుల కుటుంబాలను పరామర్శించారు. దొడగట్ట గ్రామాన్ని సందర్శించిన ఆయన బాధితులతో మాట్లాడారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం నుంచి అందే సాయం త్వరగా మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ చంద్రశేఖర్, ఆర్ఐ లక్ష్మీదేవి, విఆర్ఒలు గోపాల్, రామమోహన్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

క్షతగాత్రులకు పరామర్శ

హిందూపురం :పరిగి మండలం ధనాపురం క్రాస్ కొడికొండ శిర జాతీయ రహదారిలో ఆదివారం తెల్లవారుజామున జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడి హిందూపురం ఆసుపత్రిలో చికిత్స పసొందుతున్నావారిని ఎంపీ పార్థసారధి, ఆర్డీవో ఆనందకుమార్, డీసీహెచ్ఎస్ తిప్పేంద్రనాయక్, మున్సిపల్ ఛైర్మన్ డీఈ రమేష్ కుమార్, ఎమ్మెల్యే బాలకృష్ణ సహాయకులు వీరయ్య, నియోజకవర్గం సమస్యయకర్త శ్రీనివాస రావు పరామర్శించారు. ఆర్‌డిఒ ఆనందకుమార్ మాట్లాడతూ జిల్లా కలెక్టర్ చేతన్, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ అదేశాల మేరకు బాధిత కుటుంబాలకు పరిహారం అందించటానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామని తెలపారు. ప్రమాదంలో గాయపడి పరిస్థితి ఆందోళన కరంగా ఉండటంతో ప్రమీళమ్మ, అంజిరెడ్డి లకు మెరుగైన చికిత్సలకు బెంగళూరుకు, కాలు విరిగిన పాపమ్మను అనంతపురానికి తరలించారు. కాగా ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించినట్లు పరిగి ఎస్ఐ రంగయ్య యాదవ్ తెలిపారు. కర్నాటక రాష్ట్రం దేవనహళ్లి వద్ద వాహనాన్ని సీజ్ చేసినట్లు చెప్పారు.

హిందూపురం ఆసుపత్రిలో బాధితులను పరామర్శిస్తున్న నాయకులు

మృతుడి కుటుంబానికి అండగా ఉంటాం

ప్రజాశక్తి-హిందూపురం

రైలు ప్రమాదంలో మృతి చెందిన కార్మికుడు పిఎన్ మూర్తి కుటుంబానికి అండగా ఉంటామని ఓ పి డి ఆర్ శ్రీనివాసులు, కార్మిక సంఘ నాయకులు రవి కుమార్ తెలిపారు. గత నెల 29వ తేదిన తూమకుంట పారిశ్రామిక వాడలోని రోల్ వెల్ పరిశ్రమలో విధులు నిర్వహిస్తున్న కర్నాటక రాష్ట్రం గౌరిబిదనూరు తాలూక చిక్క కురుగోడు గ్రామంలో నివాసం ఉంటున్న కార్మికుడు పిఎన్ మూర్తి రైలు ప్రమాదంలో మృతిచెందాడు. ఈ నేపథ్యంలో ఒపిడిఆర్ శ్రీనివాసులు, తూమకుంట పారిశ్రామిక వాడ కార్మిక సంఘం నాయకులు ఆదివారం మృతుని గ్రామానికి వెళ్లి మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు కార్మికుని కుటుంబానికి తాము అన్ని వేళాల అండగా ఉంటామన్నారు. పరిశ్రమ నుంచి న్యాయంగా అందాల్సిన అన్ని సదుపాయాలను అందే విధంగా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రోల్‌వెల్ కార్మిక సంఘం గౌరవాధ్యక్షులు రవికుమార్, తూమకుంటపారిశ్రామిక వాడ కార్మిక సంఘం ఉపాధ్యక్షులు పి బాబు, కార్మిక నాయకులు రమేష్, శ్రీరామప్ప తదితరులు పాల్గొన్నారు.

రాజధాని పేరుతో మోసం

రౌండ్‌టేబుల్ సమావేశంలో నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం రాజధాని పేరుతో రాష్ట్ర ప్రజలను మోసం చేస్తోందని, అమరావతి అభివృద్ధికి రూ. లక్ష కోట్లు కేటాయించిన ప్రభుత్వం, రూ. 27 వేల కోట్లు కేటాయిస్తే రాయలసీమలో ఉన్న పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి అవుతాయని, దీనికి మాత్రం బడ్జెట్ లేదని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొనడం విడ్డూరంగా ఉందని ఏపీ వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక రాష్ట్ర అధ్యక్షులు నారాయణరెడ్డి విమర్శించారు. ఆదివారం పట్టణంలోని అంబేద్కర్ భవన్ లో ఏపీ వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో సాగునీటి ప్రాజెక్టులు, విభజన అంశాలు అనే అంశాలపై అన్ని రాజకీయ, వామపక్ష, ప్రజా సంఘాల నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఏపీ వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, శంకరయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఏపీ వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక రాష్ట్ర అధ్యక్షులు నారాయణరెడ్డి, ఉపాధ్యక్షులు రమణ, జిల్లా అధ్యక్షులు గంటా నారాయణరెడ్డి, వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త దీపికా వేణు రెడ్డి, సిపిఎం రైతు సంఘం జిల్లా నాయకులు సిద్ధారెడ్డి, చైతన్య గంగిరెడ్డి, డి సి సి బ్యాంక్ మాజీ వైస్ ఛైర్మన్ ఆనందా రంగారెడ్డి, బి ఎస్ పి రాష్ట్ర నాయకులు శ్రీరాములు, కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్యామ్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయలసీమ వ్యాప్తంగా పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి కావాలంటే ప్రజా ఉద్యమాలు తప్పనిసరి అని అన్నారు. రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు సమానంగా అభివృద్ధి చెందితేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని అన్నారు. రాష్ట్రంలో ఉన్న అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిపై ఉందన్నారు. గోదావరి అనుసంధానం పేరుతో వేలాది కోట్లు కేటాయిస్తున్నారని దీనికన్నా ముందు పెండింగ్ ప్రాజెక్టును పూర్తి చేయాలని అప్పుడే అనుసంధానానికి అర్థం ఉంటుందనిఅన్నారు. హంద్రీనీవా కాలువలకు లైనింగ్‌పనులను ఆపి 11 వేల క్యూసెక్కుల సామర్థ్యంతో కాలువలను వెడల్పు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర విభజన జరిగి 11 సంవత్సరాలు పూర్తి అయినప్పటికీ నేటికీ విభజన హామీలను కేంద్ర ప్రభుత్వం నెరవేర్చలేదన్నారు. గట్టిగా అడగాల్సిన అధికార పార్టీ కేంద్రానికి తొత్తుల వ్యవహరిస్తోందని విమర్శించారుజ వైసిపి ఏ మాత్రం నోరు మెదపడం లేదన్నారు. ఏపీ వెనుకబడిన ప్రాంతాల అభివద్ధి వేదిక ఆధ్వర్యంలో పార్టీలకు అతీతంగా వామపక్ష ప్రజాసంఘాల నాయకులను కలుపుకొని రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ నూతన కార్యవర్గాలను ఏర్పాటు చేసి అవగాహన కార్యక్రమాలను చేపట్టామన్నారు. వచ్చే జనవరి నుంచి ప్రజా ఉద్యమాన్ని చేపడుతున్నామన్నారు. ఈ ఉద్యమాల్లో ప్రజలందరూ పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎంఐఎం పార్టీ మున్నా, జై భీమ్ రావు భారత్ పార్టీ ఊటుకూరు నాగరాజు, సిపిఐ శివప్ప, ఎంఎస్ఎఫ్ రవికుమార్, దళిత సమైక్య నాయకులు నారాయణ, బీసీ సంక్షేమ సంఘం శివప్రసాద్, నాయి బ్రాహ్మణ సంఘం నాగేంద్ర ప్రసాద్, ఎరుకల హక్కుల పోరాట సంఘం వెంకటేష్, జిల్లా నాయకులు సి శ్రీరాముల, సాకే ఆదినారాయణ, ఇర్ఫాన్, వై ఆర్ కృష్ణ, సెల్ ఫోన్ అసోసియేషన్ ఇమ్రాన్ తో ఇతర ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.



రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్న నాయకులు

ఉపాధిహామీలో పంచ ప్రాధాన్యతలు

జిల్లా నీటి యాజమాన్యసంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ విజయ ప్రసాద్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

ఉపాధి హామీ పథకంలో ఈ సంవత్సరం మొదటి త్రైమాసిక ప్రణాళికలో పంచ ప్రాధాన్యతలు అమలు చేసి అటు వ్యవసాయం అభివృద్ధికి ఇటు కూలీలకు ఉపయోగపడే విధంగా అమలు చేయనున్నామని జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) పీడీ విజయ ప్రసాద్ తెలిపారు. కరువు జిల్లాలో ఉపాధి హామీ పథకం వల్ల ఎంతోమంది వ్యవసాయ కూలీలు వలసలు వెళ్లకుండా స్థానికంగానే పనులు చేసుకుంటూ ఉపాధి పొందుతున్నారు. ఎంతో కీలకమైన ఈ శాఖ ద్వారా వేసవిలో పనిచేసే కూలీలకు పని చేసే చోట నీడ, తాగునీటి వసతి, ప్రథమ చికిత్స కిట్టు కల్పించాల్సి ఉంది. అయితే దాదాపు ఎక్కడా ఇలాంటి సదుపాయాలు కల్పించడం లేదు. అంతేగాక పనులు చేసి 10 వారాలు అవుతున్న బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా సుమారు 57వేల మంది కూలీలు ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్నారు. అడిగిన వారందరికీ పని కల్పించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉంది. అయితే చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో కూలీలలో అసంతృప్తి నెలకొంది. ఈ నేపథ్యంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ విజయ ప్రసాద్ ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖి ఇంటర్వ్యూలో పలు అంశాలు ప్రస్తావించారు.

ప్రశ్న : ఉపాధికి పంచ ప్రాధాన్యతలు అంటున్నారు.. వాటి వివరాలు తెలపండి.?

జవాబు : ప్రభుత్వ ఆదేశాలతో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం క్రింద ఈ ఆర్థిక సంవత్సరంలో మొదటి త్రైమాసికంలో 5 అంశాలకు ప్రాధాన్యత ఇవ్వడానికి ప్రణాళికలు రూపొందించడం జరిగింది. ముఖ్యంగా రైతులకు, కూలీలకు ఉపయోగపడే విధంగా రానున్న వర్షాకాలంలో ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టి భూమిలో ఇంకే విధంగా చర్యలు తీసుకుంటున్నాం.

ఇందులో భాగంగానే 5 అంశాల ద్వారా నీటి నిల్వల కోసం ప్రణాళికలు అమలు చేస్తున్నాం. నీటి కుంటలు (ఫారం ఫండ్స్), పంట కాలువలో పూడికతీత, చెరువులు పునరుద్ధరణ, పశువుల నీటి తొట్టెలు నిర్మాణం, కూలీలకు భరోసా అనే 5 ప్రాధాన్యత అంశాలపైనే జిల్లా యంత్రాంగం దృష్టి పెట్టింది.

ప్ర: జిల్లాలో ఎన్ని నీటి కుంటలు నిర్మించనున్నారు.?

జ : ఈ ఆర్థిక సంవత్సరంలో వేసవిలో కూలీలు వలస వెళ్లకుండా ఉపాధి పనులు కల్పించాలన్న లక్ష్యంతో రాబోవు 3 నెలల్లో 9 వేల ఫారం ఫండ్స్ నిర్మించాలని ప్రణాళికను సిద్ధం చేశాం. దీనికి వ్యయం రూ. 62 కోట్లు అవుతుంది. ఈ కుంటల నిర్మాణం వల్ల రైతు పొలాల్లో వర్షపు నీటిని ఒడిసి పట్టేందుకు అవకాశం ఉంది. ప్రధానంగా వర్షపు నీరు వృథా కాకుండా ఆ రైతుల పొలాల్లోనే ఇంకిపోయే అవకాశం ఉంటుంది. తద్వారా భూగర్భ జలాలు పెరగడానికి వీలు ఉంటుంది. ఇది రైతులకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది. అలాగే పశువుల దాహం తీర్చడానికి ప్రతి గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఎన్ని తొట్టెలు నిర్మించాలన్నది గుర్తించడం జరిగింది. 1362 నీటి తొట్టెలు నిర్మాణం చేయాలన్న లక్ష్యం కాగా ఇందుకు రూ. 48 కోట్లు ఖర్చు చేయనుం.

ప్ర : చెరువుల పునరుద్ధరణ, కాలువలలో కూడిక తీత పనులు వివరాలు వివరించండి ?

జ: చెరువులలో పూడికతీత పనులు చేపట్టి ఆ మట్టిని రైతు పొలాలకు తోలుకొనే విధంగా ప్రణాళికలు సిద్ధం చేశాం. గత ఆర్థిక సంవత్సరంలో అమృత సరోవర పథకం క్రింద 82 చెరువుల్లో పూడికతీత పనులు చేపట్టడం జరిగింది. ఇందుకు రూ. 6.48 కోట్లు ఖర్చు చేశాం. పంట కాలువలలో కూడా పూడికతీత పనులు చేపట్టడానికి తగిన ప్రణాళికలు సిద్ధం చేశాం.

ప్ర : ఉపాధి పనులు క్రింద ఇంకా ఏయే పనులు చేపడుతున్నారు.?

జ: జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద 189 కిలోమీటర్ల సిసి రహదారులు, బిటి రహదారులు నిర్మించడం జరిగింది. ఇందుకు రూ. 150 కోట్లు ఖర్చు చేయడం జరిగింది. పశువుల పాకలు 1325 గాను 910 షెడ్లు నిర్మించడం జరిగింది. ఇందుకు రూ. 25 కోట్లు ఖర్చు చేయడం జరిగింది. స్వచ్ఛ ఆంధ్ర లో భాగంగా రూ. 11 కోట్లతో 1800 ఇంకుడు గుంతలు పూర్తి చేశాం. రూ. 42 కోట్లతో సుమారు 7 వేల ఎకరాలలో మొక్కలు పెంపకం చేపట్టాం. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు కూలీల రూపంలో రూ. 240 కోట్లు, మెటీరియల్ రూపంలో రూ. 193 కోట్లు ఖర్చు చేయడం జరిగింది. ప్రభుత్వ కార్యాలయాల ముందు 109 ఇంకుడు గుంతలు ఏర్పాటు చేశాం.

ప్ర : కూలీలకు పెండింగ్ లో ఉన్న బిల్లులు ఎప్పుడు చెల్లిస్తారు.?

జ : కూలీలకు సుమారు 10 వారాల బిల్లులు చెల్లించాల్సి ఉంది. అలాగే పశువుల పాకలు (షెడ్లు) నిర్మాణాలకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటన్నింటికీ రూ. 90 కోట్లు బిల్లులు చెల్లించాల్సి ఉంది. ప్రభుత్వానికి నివేదించాం. త్వరలో నిధులు మంజూరు కానున్నాయి. మంజూరైన వెంటనే పెండింగ్ బిల్లులు చెల్లిస్తాం.

ద్వామా పీడీ విజయ ప్రసాద్

ప్ర : రైతులకు, కూలీలకు మీరు ఇచ్చే సలహాలు, సూచనలు ఏమిటి.?

జ : రైతులు తమ పొలాల్లో నిర్మించే ఫారం పాండ్స్‌ను వినియోగించుకోవాలి. చెరువుల్లో పూడిక తీత పనులతో రైతులు తమ భూములకు సారవంతమైన మట్టిని తోలుకోవాలి. వర్షం నీరు చుక్క వృథా కాకుండా భూమిలోనే ఇంకిపోవాలి. అందుకు ప్రభుత్వం అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలి. కూలీలకు ప్రభుత్వం 307 రూపాయల కూలి ఇస్తోంది. వలసలు పోకుండా అడిగిన వారందరికీ ఉపాధి కల్పించడం జరుగుతుంది. పెండింగ్ బిల్లులు త్వరలో ఇస్తాం. పనిచేసే చోటా సదుపాయాలు కల్పించకుంటే తమ దృష్టికి తెస్తే చర్యలు తీసుకుంటాం.

టిటిడి గోశాలలో గోవుల మృతిపై
వైసిపి దుష్ప్రచారం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

పవిత్రమైన టిటిడి గోశాలలో గోవులు చనిపోయాయని వైసిపి దుష్ప్రచారం చేస్తోందని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు వదంతులను నమ్మొద్దని సూచించారు. టిటిడి గోశాలలో వంద గోవులు చనిపోయాయని టిటిడి మాజీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి చేసిన ప్రచారంలో వాస్తవం లేదన్నారు. వారు కేవలం మత విద్వేషాలను రెచ్చగొట్టేలా, భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా తప్పుడు ప్రచారం చేస్తూ తిరుమల తిరుపతి దేవస్థానం ప్రతిష్టను దిగజార్చే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేవతలతో సమానంగా కొలిచే గోమాతలపై కూడా అసత్య ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్కడో చనిపోయిన ఆవుల ఫొటోతో తప్పుడు ప్రచారం చేస్తున్నారని, అవాస్తవ ప్రచారాన్ని ప్రజలు నమ్మొద్దని సూచించారు. టిటిడిలో సమూల ప్రక్షాళన జరగాలని, ఎన్నికల ముందు బాబు ఇచ్చిన హామీ మేరకు ఇప్పటికే అనేక మార్పులు చేశారన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం భక్తులకు అందిస్తున్న సేవలు, సౌకర్యాలపై సిఎం చంద్రబాబు ఎప్పటికప్పుడు సమీక్ష చేస్తున్నారన్నారు. దర్శనాలు, వసతి, ఇతర సేవలపై భక్తుల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకున్నారని ఆమె తెలిపారు.

మేజర్ గ్రామపంచాయతీ మార్కెట్ వేలాలు
ఈ సారైనా సక్రమంగా జరిగేనా..?

ప్రజాశక్తి-కొత్తచెరువు

కొత్తచెరువు మేజర్ గ్రామపంచాయతీ మార్కెట్, షాపింగ్ గదుల వేలాల ప్రక్రియను పంచాయతీలో గందరగోళాలు జరగడం, రాజకీయ ఒత్తిళ్లతో పలుమార్లు వాయిదా వేస్తున్నారు. అయితే మార్చి నెలాఖరు లోపే వేలం ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంది. మార్చి 26వ తేదీ పంచాయతీ గెజిట్ ప్రకారం వేలం పాట నిర్వహించారు. వారపు సంతను రూ. 15లక్షలు దక్కించుకొగా బస్టాండ్, దినసరి సంత వేలం పాటలు వాయిదా వేశారు. ఆ తర్వాత పంచాయతీ ఇన్‌ఛార్జిగా ఉన్న కార్యదర్శి రామ్‌గోపాల్‌రెడ్డి విధుల నుంచి తప్పుకున్నారు. దీంతో బండ్లపల్లి కార్యదర్శి నాగరాజును ఇన్‌ఛార్జి కార్యదర్శిగా నియమించగా ఇటీవలే ఆయన బాధ్యతలు చేపట్టారు. పంచాయతీకి గదులు, మార్కెట్ నుంచి రూ. 1.5 కోట్ల బకాయిలు ఉన్నాయి. బకాయిలు చెల్లించాలని పంచాయతీ అధికారులు ఆదేశించినా వారు పట్టించుకోవడం లేదు. వేలం పాటలో వారు రాకుండా వారి మద్దతుదారులతో డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనే విధంగా చేస్తున్నారు. ఈ నెల 16, 19 తేదీల్లో మార్కెట్ వేలాలు, 49 షాపింగ్ గదులకు తిరిగి డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని పంచాయతీ అధికారులు తెలిపారు. ఈ సారైనా వేలం పాటలు సక్రమంగా జరుగుతాయో లేదో అని ప్రజలు చర్చించుకుంటున్నారు. వేలం పాటలు సక్రమంగా నిర్వహించి పంచాయతీ అభివృద్ధికి తోడ్పడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

తహశీల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న ముస్లింలు

వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ నిరసన

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

వక్ఫ్ సవరణ బిల్లును రద్దు చేసేంత వరకు పోరాటం ఆగదని పట్టణంలోని మసీదు కమిటీ సభ్యులు తెలిపారు. పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం ముందు జామియా మసీద్ అధ్యక్షతన ముస్లింలు చేపట్టిన నిరసన దీక్షలు ఆదివారం కూడా కొనసాగాయి. వారు మాట్లాడుతూ ఈ దీక్షలను 20వ తేదీ వరకు కొనసాగిస్తామని తెలిపారు. సవరణ బిల్లును వెనక్కి తీసుకునేంత వరకూ వివిధ రూపాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. వీరికి పలు సంఘాల వారు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో ముస్లిం మైనారిటీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఒడిసిలో మట్టలు చేతబూని ప్రదర్శన చేపట్టిన క్రైస్తవులు

ఘనంగా 'మట్టల ఆదివారం'

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

క్రైస్తవులు గుడ్ ఫ్రైడే, ఈస్టర్ పండుగకు ముందు జరుపుకొనే 'మట్టల ఆదివారం'ను మండలం లోని కర్నాటక నాగేపల్లి గ్రామంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. కర్నాటక నాగేపల్లి కింగ్స్ చర్చిలో పాస్టర్ అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో మట్టల ఆరాధన ప్రార్థనలు నిర్వహించారు. అలాగే మట్టల ఆదివారం గురించి భక్తులకు వివరించారు. కింగ్స్ చర్చి నుంచి భక్తులు, పిల్లలు మట్టలు చేత పట్టుకొని గ్రామంలోని వీధుల్లో తిరుగుతూ పలువురికి పండ్లు పంచిపెట్టారు. అనంతరం పాస్టర్ సులేమి కింగ్స్ చర్చి యూత్ సభ్యులు కేక్ కట్ చేసి పంచిపెట్టారు. చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

ఓబుళదేవరచెరువు : స్థానిక సిఅండ్ ఐజి మిషన్ చర్చిలో మట్టల ఆదివారాన్ని ఘనంగా నిర్వహించారు. క్రైస్తవులు మట్టలు పట్టుకుని చర్చి చుట్టూ ప్రదర్శన నిర్వహించారు. హోసన్నా జయము అంటూ నినాదాలు చేశారు. ప్రత్యేక గీతాలు ఆలపించారు. పాస్టర్ డాక్టర్ రెవరెండ్ ఎంజి.జయానందం మట్టల ఆదివారం విశిష్టతను వివరించారు. ప్రతి ఒక్కరూ యేసు క్రీస్తు చూపిన సన్మార్గంలో నడవాలని సూచించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ విద్యార్థినుల సత్తా

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులు ఇంటర్ పరీక్ష ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపల్ మహాలక్ష్మిదేవి తెలిపారు. ప్రథమ సంవత్సరం ఫలితాల్లో 69శాతం, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 85.1శాతం ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. సెకండ్ ఇంటర్ బైపిసిలో ఎస్.పల్లవి-958, సీఈసీలో డి.జీవన-950, ఎంపీసీలో రుమానా-936, హెచ్ఈసిలో మహేశ్వరి-908, ఎంఎల్‌టిలో రూపా-956, ఓఏలో ఆస్మా-904, ఎంపిహెచ్‌డబ్ల్యులో మమత-954 మార్కులు సాధించారు. అలాగే ఫస్ట్ ఇంటర్‌లో ఎంపీసీలో ఎస్.భవానీ-461, బైపీసీలో ఎస్.సాయిశిల్ప-429, సీఈసీలో ఎం.నాగహారిక-420 మార్కులు సాధించారు. విద్యార్థినులను ప్రిన్సిపల్‌తో పాటు కళాశాల ఛైర్మన్ బండి వేణుగోపాల్, అధ్యాపకులు హాజీపీరా, పెద్దన్న, రామానుజులరెడ్డి, ప్రభాకర్, బోధనేతర సిబ్బంది అభినందించారు.

మార్కెట్ యార్డ్ నూతన ఛైర్మన్‌కు సన్మానం

మడకశిర : రొళ్ల మండలంలోని రత్నగిరిలో ఆదివారం మడకశిర మార్కెట్ యార్డ్ నూతన ఛైర్మన్ బిఎస్. గురుమూర్తిని ఘనంగా సన్మానించారు. ఇటీవల కూటమి ప్రభుత్వం మార్కెట్ యార్డ్‌లకు ఛైర్మన్‌తో పాటు డైరెక్టర్లను నియమించింది. దీంతో గురుమూర్తిని టిడిపి నాయకులు కృష్ణప్ప, శివ, కుమార్ తదితరులు ఘనంగా సన్మానించారు.



బిఎస్ గురుమూర్తిని సన్మానిస్తున్న టిడిపి నాయకులు

'సోలార్' ప్రాజెక్టుల ఏర్పాటుపై అభిప్రాయ సేకరణ

ప్రజాశక్తి-నంబులపూలకుంట

సోలార్ ప్రాజెక్టుల పేరుతో ప్రభుత్వం రైతుల వ్యవసాయ భూములను స్వాధీనం చేసుకోవడానికి సిద్ధంగా ఉందని రైతు సంఘం జిల్లా నాయకులు హరి, గంగాధర్‌నాయుడు, సుధాకర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. 'సోలార్' ప్రాజెక్టుల ఏర్పాటుపై ఆదివారం వారు మండలంలోని మర్రికొమ్మదిన్నె, జవుకుల, ఎర్రవంకులపల్లి, తదితర గ్రామాల్లో రైతులతో సమావేశం నిర్వహించి వారి అభిప్రాయాలు సేకరించారు. వారు మాట్లాడుతూ తరతరాలుగా భూములను నమ్ముకుని జీవనం సాగిస్తున్న రైతుల భూములను లాక్కోవడం ఏంటని ప్రశ్నించారు. ఇకనైనా రైతులకు ఏడాదికి ఎకరాకు రూ. 50 వేలు ఇవ్వాలన్నారు. 2013 భూ సేకరణ చట్టం అమలు చేసి చట్టబద్ధత కల్పించి రైతులను ఆదుకోవాల న్నారు. పశువులు, గొర్రెలు, మేకలు, తదితర జీవాలను మేపుకోవడానికి ప్రతి గ్రామపంచాయతీ పరిధి లో 500 ఎకరాల మిగులు భూమిని కేటాయించాలని డిమాండ్ చేశారు. గతంలో నంబులపూల కుంట, పి.కొత్తపల్లి గ్రామాల్లో ఇంటికో ఉద్యోగం కల్పిస్తామని, నష్టపరిహారం రూ. 50 వేలు చెల్లిస్తామని హామీ ఇచ్చారే కానీ అమలు కావడం లేదని, వెంటనే ఆయా హామీలను నెరవేర్చి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేనిచో సిపిఎం, రైతు సంఘం ఆధ్వర్యంలో రైతుల తరఫున ఆందోళనలు ఉధృతం చేస్తామని, సోలార్ ప్రాజెక్టు పనులను అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల రైతు సంఘం, సిపిఎం నాయకులు నాగిరెడ్డి, సిఐటియు నాయకులు నాగరాజు, ఈశ్వర్‌రెడ్డి, రైతులు షేక్ ముబారక్, హబీబుల్లా, కె.పక్కీరప్ప, కాశీం, జి.జమ్మేసావ్, సిద్ధమల్లు, పాల్గొన్నారు.

రైతులతో మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా నాయకులు హరి

వైభవంగా దీపోత్సవం

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండలంలోని గుడిపల్లి గ్రామంలో వెలసిన రంగనాథస్వామి బ్రహ్మరథోత్సవంలో భాగంగా ఆదివారం ఆది ఆంధ్రుని దీపోత్సవం కార్యక్రమాన్ని వేలాది మంది భక్తుల రంగనాథ స్వామి నామస్మరణ మధ్య అత్యంత వైభవంగా నిర్వహించారు. మొక్కుబడి ఉన్న భక్తులు స్నానమాచరించి ఆలయంలో పూజలు నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం మేళతాళాలు, కరతాళ ధ్వనుల మధ్య ఓ జ్యోతిని తీసుకొచ్చి, ఆ జ్యోతిని భద్రతగా ఆలయం బయట ఉన్న స్తంభంపైకి తీసుకెళ్లి ఓ చిన్న దీపాన్ని వెలిగిం చారు. ఈ అద్భుత దీపోత్సవానికి ఓ ప్రత్యేకత ఉంది. పూర్వీకుల కథనం మేరకు.. ఈ ఆలయానికి సుదూరంలో ఒక చిన్న గుడి ఆవరణలో ఓ దళితుడు మూడు రోజుల పాటు ఉపవాసం ఉండి, ఒక మూగిటలో నిప్పులు వేసి మూడు రోజుల పాటు ఆర్పకుండా పూజలు నిర్వహిస్తుంటాడు. మూడు రోజుల అనంతరం ఉదయాన్నే ఆ మూగిటను ఆ వ్యక్తి చేతిలో ఉంచుకొని ఆలయం బయట ఉన్న స్తంభంపై ఉంచుతాడు. ఆ దీపాన్ని తిలకేంచేందుకు ఓ గద్ద వస్తుందని కథనం. దీనివల్ల ప్రజలు సుభిక్షంగా ఉంటారని, పంటలు బాగా పండి రైతులు సంతోషంగా ఉంటారన్నది ప్రజల నమ్మకం. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు జిల్లా నుంచే కాకుండా కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. బ్రహ్మరథోత్సవంలో ఈ దీపోత్సవం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. దీపోత్సవం చూసేందుకు వచ్చిన భక్తులకు ఆలయ ధర్మకర్త రమాకాంత్‌రెడ్డి, సర్పంచి గిరిజమ్మ నాగరాజరావు, కార్యనిర్వాహక అధికారి ఈశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. బ్రహ్మరథోత్సంలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు నిర్వహించారు.

గుడిపల్లి గ్రామంలో జరిగిన ఆది ఆంధ్రుడి దీపోత్సవంలో పాల్గొన్న భక్తజనం

సామాజిక మాధ్యమాల్లో అనుచిత పోస్టులపై చర్యలు : డీఎస్పీ

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

ఎంతటి వారైనా సామాజిక మాధ్యమాల్లో రెచ్చగొట్టే, అనుచిత పోస్టులు పెడితే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ హేమంత్ కుమార్ హెచ్చరించారు. సామాజిక మాధ్యమాలైన వాట్సప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, టెలిగ్రామ్, యూట్యూబ్, ఎక్స్, ట్విట్టర్, తదితర సోషల్ మీడియాలో ఇతరులను కించ పరిచేలా అనుచిత, అనైతిక, అవమానకర రీతిలో పోస్టులు పెట్టే వారిపై కఠిన చర్యలు తీసుకుం టామన్నారు. అలాగే రాజకీయంగా, కులాల మధ్య విద్వేషాలు సృష్టించే వ్యాఖ్యలు చేసినా, రెచ్చగొట్టే సమావేశాలు, దుష్ప్రచారం, మతపరమైన సున్నిత అంశాల్లో వదంతులు, అవాస్తవాలు ప్రచారం చేస్తూ ఇతరుల మనోభావాలు దెబ్బతీసేలా వ్యవహరించినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవన్నారు. వాస్త వాలు, నిజా నిజాలు తెలుసుకోకుండా వివాదాస్పద విషయాలు లేదా తప్పుదారి పట్టించే ఫేక్ న్యూస్ పెట్టడం, షేర్ చేయడం, అనుచిత, అసభ్య పోస్టులు పెట్టడం, ప్రోత్సహించడం, సహకరించడం వంటి వి కూడా చట్టరీత్యా నేరమే అన్నారు. ఈ తరహా కార్యకలాపాలపై అనుక్షణం పోలీస్ నిఘా ఉంటుం దని, ఈ తరహా నేరాలకు పాల్పడే వారు ఎంతటి వారైనా వెంటనే గుర్తించి, కేసులు నమోదు చేస్తామన్నారు.

డీఎస్పీ హేమంత్‌కుమార్

రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ఆనంద రంగారెడ్డి

మడకశిర బ్రాంచ్, బైపాస్ కాలువలతోనే సాగు, తాగునీరు

ప్రజాశక్తి-మడకశిర

హంద్రీనీవా మడకశిర బ్రాంచ్, బైపాస్ కాలువల ద్వారానే మడకశిర, హిందూపురం, పెనుకొండ ప్రాంతాలకు సాగు, తాగునీరు రావడానికి సాధ్యమవుతుందని వైసిపి అధికార ప్రతినిధి ఆనంద్ రంగారెడ్డి పేర్కొన్నారు. హిందూపురంలోని అంబేద్కర్ భవన్‌లో ఆదివారం ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో సాగునీటి ప్రాజెక్టులు, విభజన హామీలు, తదితర అంశాలపై ఏర్పాటుచేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ ప్రాంతంలో ప్రతిపాదనలో ఉన్న రిజర్వాయర్లను వెంటనే చేపట్టడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. గొల్లపల్లి రిజర్వాయర్ ద్వారా నీరు వాడుకుంటున్న కియా కార్ల పరిశ్రమ కార్పొరేట్ రెస్పాన్సిబిలిటీ నిధులను ఎక్కడెక్కడో ఖర్చు చేస్తుందో తెలపాలన్నారు. అలాగే ఈ ప్రాంత సమగ్రాభివృద్ధికి కృషి చేయాలని కోరారు.



అత్యుత్తమ మార్కులు సాధించిన ఎస్‌డిఆర్‌ఆర్ కాలేజ్ విద్యార్థులు

మండల టాపర్ ఎస్‌డిఆర్‌ఆర్ కాలేజ్ విద్యార్థిని

ప్రజాశక్తి-ముదిగుబ్బ

స్థానిక ఎస్‌డిఆర్‌ఆర్ కాలేజ్ విద్యార్థిని నిఖిలేశ్వరి-945(బైపిసి) మార్కులతో మండల టాపర్‌గా నిలిచింది. కెజిబివి విద్యార్థిని తులసి 913, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి షణ్ముఖ-902 మార్కులు సాధించారు. ముదిగుబ్బకు చెందిన వంకదార రాధిక ఫస్ట్ ఇంటర్‌లో 460 మార్కులు సాధించింది. వీరిని ఆయా కళాశాలల అధ్యాపక బృందం, తల్లిదండ్రులు, స్నేహితులు అభినందించారు.

కావ్యకు డాక్టరేట్

ప్రజాశక్తి-చిలమత్తూరు

టిడిపి మండల సీనియర్ నాయకుడు లక్ష్మినారాయణ యాదవ్ కుమార్తె కావ్యకు డాక్టరేట్ లభించింది. ఆమె హైదరాబాద్‌లో తెలంగాణ మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు నుంచి డాక్టరేట్ అందుకున్నారు. ఆమె విద్యారంగంలో చేసిన సుదీర్ఘ సాధనకు గుర్తింపుగా ఈ పురస్కారం దక్కింది. కెటిఆర్ కావ్యను అభినందించారు. యువతకు ఆమె స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమానికి విద్యావేత్తలు, రాజకీయ ప్రముఖులు, ఆమె కుటుంబ సభ్యులు హాజరయ్యారు.

డాక్టరేట్ అందుకున్న కావ్య

రేషన్ కోసం వృద్ధురాలి అగచాట్లు

ప్రజాశక్తి-చిలమత్తూరు

మండలంలోని కొత్తచామలపల్లి గ్రామానికి చెందిన మాల చిన్న ఆదెమ్మ అనే వృద్ధురాలు రేషన్ బియ్యం కోసం అష్టకష్టాలు పడుతోంది. వయోభారంతో పాటు శారీరక బలహీనత ఉన్న ఆమె సుమా రు అర్ధ కిలోమీటర్ దూరం నడవాల్సి వస్తుందని గ్రామస్తులు పేర్కొన్నారు. ఇంత దూరం నడవడం చాలా కష్టసాధ్యం అవుతోంది. ఇలాంటి వృద్ధుల కోసం అధికారులు ఇంటి వద్దకే రేషన్ సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలన కోరుతున్నారు.

పాకుతూ వస్తున్న వృద్ధురాలు

డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘా

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

గ్యాంబ్లింగ్, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం, నిర్మానుష్య ప్రదేశాల్లో జరిగే అసాంఘిక కార్యక్రమాలకు డ్రోన్ నిఘా ద్వారా అడ్డుకట్ట వేయవచ్చునని ఎస్పీ వి.రత్న తెలిపారు. సోమందేపల్లి మండలంలోని గుడిపల్లి, పుట్టపర్తి శివారు ప్రాంతాల్లోని నిర్మానుష్యమైన ప్రదేశాల్లో ఆదివారం పోలీస్ సిబ్బంది డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘా పెట్టారు. బహిరంగంగా మద్యం తాగడం, పేకాట, గ్యాంబ్లిం గ్, అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు, గంజాయి వినియోగించే వారిపై డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘా పెట్టారు. అటవీ, నిర్మాణశ్యమైన ప్రాంతాలతో పాటుగా ఆయా పరిసర ప్రదేశాలు, తోటలపై డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటుచేశారు.

డ్రోన్ కెమెరాలతో నిఘా పెట్టిన పోలీసులు

విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి-మడకశిర

రొళ్ల మండలంలోని దొడ్డేరి పంచాయతీ రంగనపల్లి వద్ద జరుగుతున్న విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాట్లను ఆదివారం స్థానిక టిడిపి నాయకులు పరిశీలించారు. టిడిపి మండల కన్వీనర్ దాసిరెడ్డి, ప్రధాన కార్యదర్శి జీకే.ఈరన్న, ఆర్‌టిజిఎస్ రొల్లకొండ రామకృష్ణ, మీసేవ వెంకటేష్, సర్పంచ్, నాయకులు పనులను పర్యవేక్షించారు. ఈ నెల 17వ తేదీ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత, ఎమ్మెల్యేలతో కలిసి విద్యుత్ సబ్ స్టేషన్ పనులను ప్రారంభిస్తారని తెలిపారు.

పేదింట మెరిసిన విద్యా కుసుమాలు

ప్రజాశక్తి-నల్లచెరువు

యశ్వంత్ రోజా

గత శనివారం వెలువడిన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర ఫలితాల్లో మండలానికి చెందిన ఇద్దరు నిరుపేద విద్యార్థులు అత్యుత్తమ మార్కులతో ఉత్తీర్ణత సాధించి ఔరా అనిపించారు. వారిలో మండలంలోని చిన్నపల్లివాండ్లపల్లి గ్రామానికి చెందిన రైతు గుర్రం విజయ్ కూమార్తె రోజా తిరుపతిలోని శ్రీచైతన్య కాలేజీలో చదువుతూ ఎంపిసి విభాగంలో వెయ్యికి 985 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది. అలాగే నల్లచెరువుకు చెందిన ఆటో డ్రైవర్ రాజు కుమారుడు టి.యశ్వంత్ నారాయణ కాలేజీలో చదువుతూ ఎంపిసి విభాగంలో 971 మార్కులు సాధించాడు.

సమావేశమైన లయోలా పాఠశాల పూర్వ విద్యార్థులు, గురువులు

'లయోలా' పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పట్టణంలోని సాయినగర్‌లో ఉన్న లయోలా పాఠశాలలో 2001-04లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు నాటి అనుభవాలు, జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఒకరినొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం లయోలా తెలుగు మీడియం హైస్కూల్ అధినేత శంకర్‌నాయుడు దంపతులతో పాటు గురువులను సన్మానించారు.

నేరాలు ఘోరాలు

ప్రమాదంలో నుజ్జు నుజ్జయిన కారు, శారద(ఫైల్‌ఫొటో)

పుంగనూరు వద్ద రోడ్డు ప్రమాదం

కదిరికి చెందిన ఉపాధ్యాయురాలు మృతి.. భర్త, కుమార్తెకు గాయాలు

ప్రజాశక్తి-కదిరి టౌన్

ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పుంగనూరు సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కదిరి పట్టణానికి చెందిన ఉపాధ్యాయురాలు మృతి చెందగా ఆమె భర్త, కూతురు తీవ్రంగా గాయ పడ్డారు. వివరాలు.. శారద(45) మండలంలోని బాలప్పగారిపల్లిలో ఉపాధ్యాయురాలు(ఎస్‌జిటి)గా పని చేస్తుండేది. ఆమె భర్త వెంకటరమణ అన్నమయ్య జిల్లా ములకలచెరువు మండలం సోంపల్లిలో స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. ఈ దంపతులు ఇటీవల కొత్త కారు కొనుగోలు చేశారు. ఆ కారులో వారు కుమార్తె కీర్తనతో కలిసి తమిళనాడులోని అరుణాచలం(తిరువణ్ణామలై) వెళ్లారు. అక్కడ స్వామి వారిని దర్శించుకుని తిరిగి కదిరికి బయల్దేరారు. వారు పుంగనూరు సుగాలి మిట్ట వద్ద వస్తుండగా వేగంగా దూసుకొచ్చిన లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో శారద అక్కడికక్కడే మృతి చెందగా, వెంకటరమణ, కీర్తన తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వారిని మదనపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం బెంగళూరుకు తరలించారు. శారద మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో ఉంచారు.

ఆకతాయిల చేష్టలతో అరటితోట దగ్ధం..

కౌలు రైతుకు రూ. 5 లక్షల నష్టం

ప్రజాశక్తి-బత్తలపల్లి

ఆకతాయిలు చేసిన పనితో ఓ కౌలు రైతుకు సుమారు రూ. 5 లక్షల నష్టం వాటిల్లిన సంఘటన ఆదివారం మండలంలోని రాఘవంపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. రాఘవంపల్లి గ్రామానికి చెందిన ఎర్రభూమి రంగారెడ్డి సన్నకారు రైతు. వ్యవసాయంపై మక్కువతో బత్తలపల్లి సమీపంలో ఉన్న గంటాపురానికి చెందిన కోనప్పగారి రమణకు చెందిన 12 ఎకరాల భూమిని కౌలుకు తీసుకున్నాడు. ఆరెకరాల్లో అరటిపంట సాగు చేసి, 9,500 మొక్కలను రెండేళ్లుగా సంరక్షించుకుంటున్నాడు. మరో వారం రోజుల్లో పంట దిగుబడి చేతికి దక్కాల్సిన సమయంలో పొలం పక్కనున్న బీడు పొలంలో ఆదివారం ఆకతాయిలు నిప్పు పెట్టారు. దీంతో ఎండు గడ్డి కాలుతూ రంగారెడ్డి తోటకు మంటలు వ్యాపించడంతో డ్రిప్పు పైపులు, కేబుల్ వైర్లతో పాటు అరటి పంట పూర్తిగా దెబ్బతింది. మంటల తీవ్రతకు కోత దశలో ఉన్న అరటికాయలు నల్లగా కాలిపోయాయి. సమాచారం అందుకున్న రైతు రంగారెడ్డి మరో ఇద్దరితో కలిసి పొలం వద్దకు వెళ్లి మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ రూ. 5 లక్షల నష్టం జరిగిందని రైతు కన్నీటి పర్యంతమయ్యాడు. ప్రభుత్వం, అధికారులు స్పందించి సూక్ష్మ సేద్య పరికరాలు, ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని కౌలు రైతు విజ్ఞప్తి చేశారు.

విద్యుత్ ప్రమాదంలో సామగ్రి దగ్ధం

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయిన సామగ్రి

మండలంలోని ఓబుళనాయునిపల్లి గ్రామంలో శనివారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి ఓ ఇంట్లో ఎలక్ట్రానిక్, ఇతర సామగ్రి కాలిపోయాయని ఆ ఇంటి యజమాని కె.అనిత తెలిపారు. వివ రాలు.. శనివారం రాత్రి ఆమె ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లిన సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూ ట్ జరిగి మంటలు చెలరేగాయి. చుట్టుపక్కల వారు గమనించి మంటలు ఆర్పే లోపు ఉన్న ఫ్రిజ్, టీవీ, ఫ్యాన్లు, దుస్తులు, ఇతర సామగ్రి కాలి బూడిదయ్యాయని వాపోయారు. ఈ ప్రమాదంలో రూ. లక్షల నష్టం వాటిల్లిందని ప్రభుత్వం ఆదుకోవాలని బాధితురాలు విజ్ఞప్తి చేసింది.

గుండెపోటుతో రైతు మృతి

ప్రజాశక్తి-తాడిమర్రి

మండలంలోని చిల్లకొండపల్లి గ్రామంలో నివాసం ఉండే రైతు పార్నపల్లి ఆంజనేయులు(60) ఆదివారం గుండెపోటుతో మృతిచెందాడు. ఆయన ప్రతిరోజూ లాగానే పంటకు నీరు పెట్టేందుకు శనివారం రాత్రి కాలినరకన పొలానికి బయల్దేరాడు. మార్గమధ్యలో ఉన్నఫళంగా గుండె నొప్పి రావడం, ఆ సమయంలో ఎవరూ గమనించకపోవడంతో రహదారి మధ్యలోనే కుప్పకూలి మృతిచెందాడు. రైతు మృతితో ఆ కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది.

ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ నుంచి నలుగురు బహిష్కరణ

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) జిల్లా నాయకులుగా ఉన్న పవన్‌కుమార్, హర్ష కుమార్, భగత్, నందీష్‌సాయిలపై సస్పెన్షన్(బహిష్కరణ) వేటు వేసినట్లు జిల్లా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు వీరేష్, నామాల నాగార్జున ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వారు ఇటీవల కాలంలో ఎస్ఎఫ్ఐ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తుండగా గతంలోనే మందలించామని, అయినా వారి ప్రవర్తనలో మార్పు రాకపోవడంత ఎస్ఎఫ్ఐ బహిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఇక నుంచి వారిని ఈ సంఘానికి ఎటువంటి సంబంధం లేదన్నారు.

నేడు టిడిపి ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

టిడిపి అధిష్టానం ఆదేశాలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ సూచనల మేరకు సోమ వారం పట్టణంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని ఆ పార్టీ పట్టణ అధ్యక్షులు పరిసే సుధాకర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం పట్టణంలోని గాంధీనగర్ సర్కిల్‌లో ఉన్న టిడిపి కార్యాలయం నుంచి ర్యాలీగా బయల్దేరి కళాజ్యోతి సర్కిల్‌లో ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరకుని పూలమాలలు వేసి నివాళులర్పిస్తామన్నారు. ఇందులో పార్టీ శ్రేణులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

వ్యవసాయ సహకార సేవా సంఘం అధ్యక్షుడి ఎన్నిక ఏకగ్రీవం

ప్రజాశక్తి-పావగడ

తాలూకాలోని దొమ్మతమర్రి గ్రామానికి చెందిన వ్యవసాయ సహకార సేవా సంఘం అధ్యక్ష పదవికి ఆదివారం జరిగిన ఎన్నికల్లో గుమ్మఘట్ట గ్రామానికి చెందిన కె.శ్రీనివాసులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దొమ్మతమర్రి వ్యవసాయ సహకార సేవా సంఘంలో 12 మంది డైరెక్టర్లు ఉన్నారు. కె.శ్రీనివాసులు మాత్రమే అధ్యక్ష పదవికి నామినేషన్ పత్రాలు సమర్పించారు. ఇతరులెవరూ నామినేషన్ పత్రాలు సమర్పించకపోవడంతో ఎన్నికల అధికారి రాఘవేంద్ర ఎన్నికల ప్రక్రియను పూర్తి చేసి అధ్యక్ష పదవికి కె.శ్రీనివాసులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించి బాధ్యతలు అప్పగించారు. కార్యక్రమంలో నాయకులు సంజీవరాయప్ప, లక్ష్మీనారాయణప్ప, ఆదినారాయణప్ప, డిఎన్.విశ్వేశ్వరయ్య, ఈశ్వర్, సోమశేఖర్, బసవరాజు, కృష్ణారెడ్డి, గ్రామపంచాయతీ అధ్యక్షుడు హనుమంతరాయప్ప, నాగేగౌడ, ఉపాధ్యక్షుడు కృష్ణవేణిఆదినారాయణప్ప, హనుమంతప్ప, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా ఎన్నికైన వ్యవసాయ సహకార సేవా సంఘం అధ్యక్షుడుతో నాయకులు